క్లుప్తంగా

మట్కా బీటర్ల బైండోవర్



మట్కా బీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న తహసీల్దార్ సుమతి

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లికి చెందిన మట్కా బీటర్లు బాబు, సురేష్, కొడవండ్లపల్లికి చెందిన మహేష్‌ను సోమవారం తహసీల్దార్ సుమతి ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. మట్కా రాసినా, ఆడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దారు సుమతి మట్కా బీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'

యల్లనూరు: ప్రజా సమస్యల పరిష్కారానికే స్పందన కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తహసీల్దార్ సుమతి తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు ఒక వినతి వచ్చిందని పేర్కొన్నారు. యల్లనూరులో భూమి కొలతల కోసం రైతు అర్జీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

'పచ్చపురుగు'తో అప్రమత్తంగా ఉండాలి



కసాపురం వద్ద సాగు చేసిన పప్పుశనగను పరిశీలిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: పప్పుశనగను పచ్చపురుగు ఆశించిన నేపథ్యంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల అగ్రికల్చర్ ఆఫీసర్ స్వాతి సూచించారు. సోమవారం మండల పరిధిలోని కసాపురం, దోనిముక్కల గ్రామాల్లో పర్యటించిన ఆమె రైతులు సాగు చేసిన పప్పుశనగను పరిశీలించారు. పచ్చపురుగు నివారణకు క్లోరిఫైరిఫాస్ 50 ఈసీ మందును ఒక లీటర్ నీటికి 2 ఎంఎల్ చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. లేదా ఇమామెక్టిన్ బెంజోట్ 1 గ్రాము ఒక లీటర్ నీటికి దానితోపాటు ల్యాండా సైహలోత్రిన్ 2.5 ఈసీ 2 ఎంఎల్ ఒక లీటర్ నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. రబీలో పంటలు సాగు చేసిన రైతులు వెంటనే సంబంధిత ఆర్బీకే సిబ్బందిని కలిసి ఈ–క్రాప్ చేయించుకోవాలన్నారు.

నేడు హనుమద్ వ్రతం

గుత్తి: పట్టణంలోని కోటలో వెలిసిన రామస్వామి దేవాలయంలో మంగళవారం హనుమద్ వ్రతాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కసాపురం అర్చకుడు వేదం స్వామి హాజరవుతారని పేర్కొన్నారు.

జిల్లాస్థాయి ఇంటర్ స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ



ఈమంత్ రాజ్‌ను అభినందిస్తున్న దృశ్యం

గుత్తి: ఇటీవల అనంతపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లాస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నిర్వహించారు. గుత్తి గేట్స్ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థి డి.ఈమంత్ రాజ్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ప్రతిభ కనబరిచాడు. సోమవారం గేట్స్ కాలేజీలో జరిగిన ఓ కార్యక్రమంలో బ్యాడ్మింటన్‌లో రన్నరప్ టైటిల్ కైవసం చేసుకున్న ఈమంత్ రాజ్‌ను అభినందించారు. కార్యక్రమంలో గేట్స్ డైరెక్టర్ వీకే పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ సురయ, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ నరసింహులు, పీడీ జోయెల్, నాసిర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర



మడుగుపల్లిలో పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పుట్లూరు: మండలంలోని మడుగుపల్లి, చాలవేముల గ్రామాల్లో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించినట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రచార వాహనం ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఇప్పటికే అందించిన లబ్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్, ఎంఈఓ శ్రీదేవి, ఏపీఎం వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని బుర్నాకుంట, ముప్పాలగుత్తి, మల్లేనిపల్లి, లక్ష్మంపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. తొలుత బుర్నాకుంట గ్రామ సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామంలో అర్హులందరికీ పథకాలు అందించాలన్నారు. వలంటీర్లపై ఎలాంటి ఫిర్యాదులు తమ దృష్టికి రాకూడదని తెలిపారు. ఎవరైనా విధులకు సక్రమంగా హాజరుకాకుండా ప్రజలను ఇబ్బంది పెడితే సహించబోమని హెచ్చరించారు. పేదలకు ఇళ్లు కట్టించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు. అనంతరం గ్రామాల్లోని ప్రజలతో మాట్లాడారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకరావాలన్నారు. సకాలంలో ప్రభుత్వ పింఛన్లు అందుతున్నాయా అంటూ వృద్ధులను అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయా గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్నను పరామర్శించారు. లక్ష్మంపల్లిలో ఇద్దరికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గూడూరు సూర్యనారాయణరెడ్డి, తాడిపత్రి మార్కెట్‌యార్డు చైర్మన్ కొట్టాలపల్లి హరినాథరెడ్డి, అనంతపురం పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి శేషారెడ్డి, జిల్లా బీసీ సెల్ కమిటీ సభ్యుడు పాశంరంగస్వామియాదవ్, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, యువజన విభాగం కన్వీనర్ కృష్ణారెడ్డి, మండల బీసీ విభాగం నాయకుడు వెంకటస్వామి గౌడ్, మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, బుర్నాకుంట నాగరాజు, గౌరీ శంకర్, ఎర్రిస్వామి, రామాంజినేయులు, వెంకటనారాయణ, పరమేశ్వర, ముప్పాలగుత్తి ఆదినారాయణ, బాస్కర్, చంద్ర, లక్ష్మయ్య, మల్లేనిపల్లి నాగరాజు, దస్తగిరి, నాగార్జున, లక్ష్మంపల్లి చిన్న ఓబుళరెడ్డి, సత్యం రెడ్డి, హరికృష్ణారెడ్డి, బాబు, బ్రహ్మ నందరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ముప్పాలగుత్తి గ్రామంలో ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

16వ వార్డులో పర్యటన..

తాడిపత్రి అర్బన్: సీఎం వైఎస్ జగన్ పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 16వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సీఎం వైఎస్ జగన్ హయాంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతోందన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని వివరించారు. గత టీడీపీ పాలనలో కేవలం టీడీపీ వర్గీయులకే సంక్షేమ పథకాలు దక్కేవని తెలిపారు. అయితే సీఎం వైఎస్ జగన్ పాలనలో అర్హతే ప్రామాణికంగా రాజకీయాలు, కులమతాలకు అతీతంగా పథకాలను అందజేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రవి, రాష్ట్ర అధికార ప్రతినిధి కేశవరెడ్డి, పట్టణ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మనోజ్, నాయకులు సాయితేజా రెడ్డి, ప్రతాప్, అలీ, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అండగా నిలవాలి

- ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుంతకల్లు రూరల్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే సీఎం జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని పులగుట్టపల్లి, పులగుట్టపల్లి పెద్దతండా, పులగుట్టపల్లి చిన్నతండా గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతీరెడ్డి, యువ నాయకుడు మంజునాథ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు ఆప్యాయంగా పలకరించారు. యోగక్షేమాలు, వారి కష్టసుఖాలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగనన్న నవరత్నాల్లోని పథకాల ద్వారా నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను నేరుగా గడప వద్దకే చేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని తెలిపారు. గ్రామాల్లోనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి 24 గంటల పాటు ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగనన్నకు ప్రజలు అండగా నిలవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో అభివృద్ధికి అండగా నిలిచి జగనన్నను మరోసారి సీఎం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బీవీ మాధవి, జెడ్పీటీసీ కదిరప్ప, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, పార్టీ అధికార ప్రతినిధి దశరథరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు రామలింగప్ప, జింకల రామాంజనేయులు, మల్లికార్జున శాస్త్రి, ఎద్దుల శంకర్, పులగుట్టపల్లి సర్పంచ్ జయలక్ష్మి, పులగుట్టపల్లి పెద్దతండా సర్పంచ్ పార్వతీబాయి, కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, మండల కన్వీనర్ మోహన్ రావు, సచివాలయ మండల కన్వీనర్ మోహన్‌రావు, జయరామిరెడ్డి, సింగిల్ విండో సుంకిరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు సిపాయి బాషా, మాజీ సర్పంచ్ వెంకటేష్ నాయక్, పామన్న, వన్నూరప్ప, మల్లేష్, రామచంద్ర, మురళి, వీరయ్య, రామంజి, సీతారాముడు, మల్లికార్జున, కల్లప్ప, గోవర్ధన్, తిమ్మయ్య పాల్గొన్నారు.



గ్రామాల్లో పర్యటిస్తూ సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

కో–ఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభం

పామిడి: పట్టణంలో గుత్తిటౌన్ బ్యాంకుకు సంబంధించి కొత్తగా ఏర్పాటు చేసిన కో–ఆపరేటివ్ బ్యాంక్‌ను సోమవారం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం లేకపోయిన కో–ఆపరేటివ్ బ్యాంకుల మనుగడ ప్రజల సహకారంతో సాగుతోందన్నారు. బ్యాంకు రుణాలను సక్రమంగా చెల్లించి బ్యాంకు అభ్యున్నతికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఆర్ జితేంద్రగౌడ్, కొట్రికే మధుసూధన్‌గుప్తా, మాజీ ఎంపీ రవీంద్ర, రాఘవేంద్రరావు, వెంకటరత్నం, రామారావు, అంబికా ప్రసాద్, శ్రీనివాసయాదవ్, గుత్తిటౌన్ బ్యాంకు సీఈఓ ఎస్ మహేశ్వర ప్రసాద్, ఆ బ్యాంకు అధ్యక్షుడు ఎస్.అబ్దుల్ జిలాని పాల్గొన్నారు

విద్యుత్ పొదుపు ప్రగతికి మలుపు



ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: విద్యుత్ పొదుపు ప్రగతికి మలుపు. విద్యుత్‌ను ఆదా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం ట్రాన్స్‌కో ఉద్యోగుల ఆధ్వర్యంలో ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవాలని సందేశానిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే వైవీఆర్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంధన పొదుపు పాటించడం వలన గృహ, వ్యవసాయ, పరిశ్రమల రంగాల్లో విద్యుత్ వృథాను అరికట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. కరెంట్‌ను పొదుపుగా వాడుకుని భావితరాలకు భరోసా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్.రామలింగప్ప, ట్రాన్స్‌కో డీఈ రంగస్వామి, ఏఈలు రవిచంద్ర, రఘునాథ్, అబ్దుల్‌మన్నన్ తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరందిస్తాం

పుట్లూరు: మండలంలోని మడుగుపల్లి, జంగంరెడ్డిపేట గ్రామాల్లోని నీటి కుంటలను సోమవారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పరిశీలించారు. ఎంపీఆర్ సౌత్ కెనాల్ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మడుగుపల్లి, జంగంరెడ్డిపేట, ఎల్లుట్ల గ్రామాల్లోని నీటి కుంటలను నింపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పంపిన ప్రతిపాదనలపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి సమగ్ర వివరాలతో నివేదిక పంపాలని అధికారులను ఆదేశించారు. హెచ్చెల్సీ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మడుగుపల్లి బయన్న కుంటతో పాటు బసిరెడ్డికుంట, చల్లనీళ్లబెంచి కుంటలకు నీటి సరఫరా చేయడానికి ఇప్పటికే రూ.5.45 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల ద్వారా మడుగుపల్లి, జంగంరెడ్డిపేట, ఎల్లుట్ల గ్రామాలతో పాటు మూగేతిమ్మంపల్లి, రంగాపురం గ్రామాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మిద్దె కుళ్లాయప్ప, గోపాల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

యాడికి: పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధర్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని 2, 3 వార్డుల్లో హర్షవర్ధన్ రెడ్డి పర్యటించారు. ఆయా వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే చెప్పాలని సూచించారు. ఆయా వీధుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి తెలిపారు. పథకాలు మాకు పారదర్శకంగా అందుతున్నాయని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

పరామర్శ..

నెల రోజుల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో యాడికి ఎండీయూ ఆపరేటర్ మహేంద్రకు కాలు విరిగింది. ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న అతడ్ని కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి పరామర్శించారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానంద రెడ్డి, ఎంపీటీసీలు నాగరాజు, గుంతా రామాంజనమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ శివప్రసాద్, వార్డు సభ్యులు తిరుపతి, రామచంద్ర, బాల పెద్దయ్య, సోషియల మీడియా కన్వీనర్ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

సీఎస్ఐ చర్చిలో సెమీ క్రిస్మస్ సందడి

తాడిపత్రి అర్బన్: స్థానిక సీఎస్ఐ చర్చిలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం పుట్లూరు రోడ్డులోని ఏఎన్ఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించే సపోజ్ క్రిస్మస్ ఐక్య వేడుకల్లో పాల్గొనాలని పాస్టర్లు, క్రైస్తవులను కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆహ్వానించారు. అనంతరం చర్చిలోని పాస్టర్లకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.

మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యం

బుక్కరాయసముద్రం: ప్రభుత్వం పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తోందని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో చైల్డ్‌ఫండ్ ఇండియా, లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఫెసిలిటేషన్, పౌష్టిక ఆహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హెచ్ఐవీ సోకిన వారు మందులతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. మానసిక ఒత్తిడి తగ్గించుకునేందుకు యోగా, వ్యాయామం చేయాలన్నారు. హెచ్ఐవీకి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ లక్ష్మీ స్వాతి, డాక్టర్ తెహరున్నీసా హెచ్ఐవీ నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. హెచ్ఐవీ సోకిన వారు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం, తాజా ఆకుకూరలు, పండ్లను ఆహారంలో తీసుకోవాలని తెలిపారు. రోగులకు పౌష్టిక ఆహారం అందజేశారు. కార్యక్రమంలో డీపీఎం వెంకటరత్నం, డీఎస్ రమణ, డీఆర్పీ రమేష్ యాదవ్, సీహెచ్ఓ మోహన్‌రావు, పీహెచ్ఎన్ చెన్నమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ ధనుంజయ, భారతి, స్వప్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

26 వరకూ వికసిత్ భారత్ సంకల్పయాత్రలు

యాడికి: మండలంలో పంచాయతీల వారీగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించేందుకు ఈనెల 19 నుంచి 26 వరకూ వికసిత్ భారత్ సంకల్పయాత్రలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం గుడిపాడు, మధ్యాహ్నం నిట్టూరులో 20వ తేదీన చిక్కేపల్లె, కమలపాడు, 21న యాడికి, కోనుప్పలపాడు, 22న లక్షుంపల్లె, చందనలో, 23న రాయలచెరువు, తూట్రాళ్లపల్లె, 24న వేములపాడు, నగరూరు, 26న వెంగన్న పల్లె, పుప్పాల పంచాయతీల్లో యాత్ర కొనసాగుతుందన్నారు. వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు.

'ఆ సర్వే నంబర్‌లో పట్టాలు ఇవ్వొద్దు'

గార్లదిన్నె: మండల పరిధిలోని కోటంకలో 243–1 సర్వే నంబర్‌లో ఉన్న రాళ్ల గుట్ట అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు కాపాడాలని గ్రామస్తులు కోరారు. సోమవారం వారు ఆందోళన చేపట్టారు. రాళ్ల గుట్టలో గ్రామ అవసరాల దృష్ట్యా రెండు పంచాయతీ బోర్డు వేశామన్నారు. అలాగే గ్రామంలో పాడి పశువులు అధికంగా ఉండటంతో పశువుల మేతకు ఆధారంగా రాళ్ల గుట్ట ఉందన్నారు. భవిష్యత్తులో గ్రామ అవసరాల నిమిత్తం రాళ్లగుట్టలో ఎవ్వరికి పట్టాలు ఇవ్వొద్దని కోరారు. అయితే కొంతమంది అక్రమంగా జేసీబీలతో గుట్టలో భూమిని చదును చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించామన్నారు. ఇటీవల గుట్ట అన్యాక్రాంతం కాకుండా పోలీసుల రక్షణలో చెట్లు నాటడంతో కొంత మంది దౌర్జన్యంగా చెట్లు తొలగించారని తెలిపారు. గుట్టలోకి ఎవ్వరు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే స్పందించిన రెవెన్యూ అధికారులు గుట్టలోని భూమిని ఎవరూ సాగు చేయొద్దని తెలిపారు. గుట్టలోకి వెళ్లే వారిపై కేసులు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

జగనన్నతోనే రాష్ట్రానికి భవిష్యత్తు



పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలు నిరంతరంగా కొనసాగాలన్నా.. రాష్ట్రం ప్రగతి పథంలో నడవాలన్నా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని తెలిపారు. సోమవారం పట్టణంలోని 32వ వార్డు కౌన్సిలర్ వై.సుధాకర్ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ ఆవరణలో పార్టీ పతాకాన్ని ఆమె ఎగురవేసి వందనం చేశారు. సచివాలయం పరిధిలోని జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. పేదరిక నిర్మూలన జగనన్నతోనే సాధ్యమని తెలిపారు. జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కుమారి, జేసీఎస్ కన్వీనర్ ఖలీల్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటీకి నేషనల్ ఎంప్లాయ్‌బిలిటీ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎస్ఆర్ఐటీ యాజమాన్యం

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు ఎస్‌హెచ్ఎల్ ద్వారా నేషనల్ ఎంప్లాయ్‌బిలిటీ అవార్డు లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌హెచ్ఎల్ టాలెంట్ సొల్యూషన్స్‌లో గ్లోబల్ లీడర్, సైకోమెట్రికల్ టెస్ట్‌లలో ప్రముఖ బ్రాండ్ అన్నారు. కమ్యూనికేషన్, టెక్నికల్, స్కిల్స్, లాజికల్, రీజినింగ్ క్వాంటిటేటివ్ స్కిల్స్, జాబ్ స్పెసిఫిక్ డొమైన్ స్కిల్స్‌పై విద్యార్థులకు శిక్షణ ఇస్తుందన్నారు. ఏఎంసీఏటీ పరీక్షలో విద్యార్థులు ప్రతిభ కనబరచడంతో అవార్డు వచ్చిందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

కమనీయం.. సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి



గుంతకల్లులో సుబ్రహ్మణ్యేశ్వరుడి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం



సుబ్రహ్మణ్య స్వామికి కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

గార్లదిన్నె: మండల పరిధిలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. అంతకుముందు శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

గుంతకల్లు: స్థానిక సత్యనారయణపేటలోని అదెప్ప బావి సమీపంలో సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాకారోత్సవం అనంతరం మహామంగళహారతి ఇచ్చారు. వందలాది మంది భక్తులు పాల్గొని స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వహకులు అన్నదానం చేశారు.